అని మనం అనుకోవాలి. ఇతను అప్పట్లో చూపిన బొద్దునుబట్టే విద్దెంను బట్టే అని అనుకోవాలి. నాయీసహజమ్మని జీవిత గాథను గుఱించి నేనెప్పుడు తలపోసినా అలనాటి ఆ వింతగాథ అదిమంగా అమాయికంగా నా ఆత్మకు తట్టుతుంది.

అదే దృశ్యం అతడు దివంగతుడైన తరుణంలో కూడా నాకాపొద్దు తలపోతకు రాకతప్పిందికాదు. ఆ దృశ్యం అప్పట్లో నన్ను ప్రశ్నించిన " నాంవుకు " వర్ణించడం ఎట్లా ? నా నాలుక వెనుకాడింది. నాలుక వెనుకాడడంలో చనిపోయిన ఆ సహజ మ్మని పోలిక లోలో ప్రకాశించింది.

" శరీరమెక్కడ దాచినా నశించేదే బిడ్డా ! ఆత్మకే చావు లేదు." అని నా యెట్టయెదుట ఇంకనూ కూర్చుని ప్రత్యుత్తరం కాంక్షిస్తూవున్న కొండికతో అన్నాను. ఆ కుఱ్ఱడు " ఆత్మ మాత్రం ఎలా శాశ్వతంగా వుంటుంది ? మంచుకంటె చల్లనైన కరగని నిత్యశీతల పదార్థమేదైనా దాన్ని కాపాడుతూ వుంటుందా ? " అని అడిగాడు—వానికింకా మంచుగది—కాదు కాక మంచుకొండ-వేగుబోక ఆలా మనస్సును బట్టి వుండబోలు !

" లేదుమఱీ పరమాత్మ ? దానిలో లీనమై ప్రతీ ఆత్మ శాశ్వత శాంతిభావం సహించి తీరుతుంది. నిత్య సత్యశీతలం అది వాక్కఁటే. ఎన్నటికీ కరగనిది అది వాక్కఁటే " అని సూటిగా వాక్రుచ్చాను.

.... .... .... .... ....

## మాతృ చిహ్నము

నేనే కాదు, ఏ మానవుడు కాని, తన పుట్టిన తేదీని గురించి తాను పుట్టినప్పుడు తనతల్లి పడిన ప్రసవ వేదనాదులను గురించి

ఇతరులు చెప్తే తెలిసికోవలసిందే కాని మరో పద్ధతి లేదు. ఒక్కొక్కప్పుడు ప్రభుత్వం వారుంచే జనన మరణ పట్టికలు సాయపడతాయి కాని వానిలో వ్రాసేది ఎవరో వెళ్ళి నివేదించే దాన్ని బట్టి గ్రామాధికారులు గుర్తించేరు గాని తాము స్వయంగా పురిటి మంచం దగ్గఱకు వెళ్ళిచూచి ఎప్పటికప్పు డెక్కడ దక్కడ వ్రాయరు.

అయినప్పటికీ అటువంటి అత్యంతం అన్యులమీద ఆధార పడి వున్న అంశాన్ని అనుసంధించుకుంటూ—"నే నీ వూళ్లో పుట్టాను, ఈ ఇంట్లో పుట్టాను, ఈ గదిలో పుట్టాను, నా తల్లి దండ్రులు వీరు, నా యింటిపేరు ఇది," అని ప్రతీ వ్యక్తీ ఎదో ఆత్మీయమైన ఆంతరంగిక ప్రేరణ ననుసరించి సుబ్బుకుంటూ ఉబ్బిపోతాడు.

అందులో తప్పేమి లేదనుకుంటాను. ఎంచేతఅంటే, పుట్టుక అనేది మనిషియొక్క తొలిప్రజ్ఞ. అందులోనూ ప్రాణంతో పుట్టడం, పుట్టీ పుట్టడంలో "కేర్ కేర్" మనడం, చిత్రాతిచిత్రమైన సుకృతి. నీ యేడుపువల్లను లోకాన్నంతనూ ఆ నిమేష మప్పుడు స్పందింపజేస్తూ ఆనందింప జేసేవు.

ఓమార్ ఖయ్యాంలోని ఉపమానం ఇంగ్లీషులో ఉటం కించి చెబితే "In the bowl of this world you are flung." ఈ ప్రపంచమనే పాత్రలోనికి నీవు విసరబడ్డావు ! మఱీన్ని నీ జీవితంలో అమ్మహాకవి మహదాశయం నీ పట్ల నెరవేరిన ఘట్టం బహుశా ఆ పుట్టుక నుంచి ఏ మూడేండ్లో, అయిదేండ్లో, ఏడేండ్లో కావచ్చును. అంతకంటె ఎక్కువ వుండనేరదు. ఆ శైశవమందు "Unborn tomorrow and dead yesterday" గా

బ్రహ్మానందంలో నిమగ్నుడవై యుంటావు. నిజం కూడా
" Why fret about them if today be sweet "

పైని వివరించిన మనస్థాయి మానవలోకాని కంతకూ సర్వసామాన్య మనుకొంటాను. ఆ శైశవాన్ని ఎంత తెలుసుకొందామన్నా సంస్మృతి కందదు.

కాని కొంద అంటారూ " తల్లిముందు కుమారు డెప్పుడూ శిశువే " అని. " తల్లి జీవించి వున్నంత కాలం కుమారుని జీవితం శైశవ క్రీడే " అని. కావచ్చు, అందులో అబద్ధం ఏమీ లేదు. కాని తల్లి శాశ్వతంగా—శాశ్వతంగా కాకపోయినా, తన కుమారునితో సరిసమానంగా బ్రతికివుండడమనేది అరుదు. వెనుక ముందు మర్యాదలనుబట్టి చూస్తే తల్లి ముందు పోవడమనేది సహజం. ఎప్పుడో అప్పుడు ప్రతీవాడూ, నిసర్గ పరిణామంలో, తన తల్లిని గోల్పోతూ తాను పెద్దవాడు కావడం తప్పనిసరి.

అటువంటి పరిణామం నాయొక్క జీవిత పంధాను ఏడవ యేటనే జరిగింది. ఆనాటినుంచీ నాకు శైశవం పోయి బాల్యం అంకురించింది అని నా నమ్మకం. ఏమా అంటే ఆ రాత్రి నాకు బాగా జ్ఞాపకం. ఇప్పటికీ నాకు బాగా గుర్తు. నా మనస్సుకదే తొలిమెఱుపు !

ఆ రాత్రి చీకటి భీకరంగా వుంది. మర్నాటి సాయం సంధ్యకుగాని బాలచంద్రుని ప్రథమ సందర్శనం కాదు. తెల్లారితే తప్ప పొద్దు పొడువదు. చుక్క ? ఎటుచూచినా అదృశ్య !

ఆ గది మా పూర్వోత్రపు టింటి భాగంలోనిదై యుండి, పురుళ్ళ గదిగా ప్రఖ్యాతి కెక్కిన గది. పురుళ్లు లేనప్పుడు

ముప్పైపుట్ల ధాన్యం పోసివుంచే పెద్దకొట్టు—దాని కొక్కటే గుమ్మం — గుమ్మానికి పైనోతలుపు క్రిందోతలుపు — అనగా ధాన్యపు పోతను క్రింద తలుపు మూసి పైతలుపుతీసే మాదిరి తలుపులు అన్నమాట. ప్రక్క ప్రక్కలకు విడివడే రెక్క తలుపులు కావు. కిటికీ అంటూ వేటేలేదు. గుమ్మం గల గోడకే ఓ మూల ఎత్తు నమర్చిన కమ్ములకంత. అదీ ధాన్యపోతప్ కను పైన బల్ల చెక్కల తీత, బల్ల చెక్కల వేతాగలదే. ఆ గదిలో గాలివుందీ అంటే ప్రాణంతో వున్న మనుష్యులయొక్క ఎగ వూపిర్నీ దిగవూపిర్నీ పురస్కరించుకొని వుంది అని అనుకో వలసిందే కాని మతో మార్గంలేదు.

మా అందరికీ అనగా పిల్లల కందరికీ సందవిడతే పెందల కడే అన్నాలు పెట్టేశారు. పెట్టేసి వెంటనే నిదరబుచ్చారు. పెద్ద లెందుకో కనిపెట్టుక్కూర్చుని వున్నారు. ఇల్లంతా బిక్కుబిక్కు మంటూ వున్నట్టుంది. ఉన్నట్టుండి గబుక్కున గొల్లుమంది. ఇంకేముంది ? నాకు మెళుకువ వచ్చింది. మెళుకువ వచ్చింది కాని ఎందుకు వచ్చిందో గోచరించింది కాదు. నా మెళుకువను గంటూ ఇంటిల్లిపాదీ ఏడుపుమాని నిశ్శబ్దంగా నడాడ సాగారు. ఎందుకో ?

గదిలోనుంచి దీపం వెలుగు ఇవతల నడవలోనికి గుమ్మం గుండా పడుతూ నడాడుతూ వున్న వాళ్ళ నీడల్ని, నీడల క్కారణాలైన వాళ్ళ వాళ్ళ నడకల్నీ వేర్పాటుగా కాపరుస్తూ వుంది. నేనా నడవలోకి, వెంటనే నా పక్కమీదనుంచి లేచి వెళ్ళి నిలబడి గదిలోకి చూస్తూ వున్నాను. చూస్తూవుంటే కొందలు "ఏమిటి చూస్తావు ?" అన్నట్టు, కొందలు

"చూడమ్మా" అన్నట్టు నా నీడచాటు పెద్దవాళ్ళ నోళ్ళంట మాటలు వినబడ్డాయి. ఆ మాటల ధోరణి ననుకరిస్తూ ఆ గదిలోకి చూచీ చూడనట్టుగా తొంగిచూచి "అదిగో! అక్కడేవుంది అమ్మ!" అని వ్రేలితో చూపెడుతూ, గిర్రున తిరిగి వచ్చేసేసి యథాప్రకారంగా నా పక్కమీద పండుకున్నాను. మైమఱచి నిద్రపోయాను.

"'అదిగో! అక్కడనే వుంది అమ్మ!" అన్న నా వాక్కు ఏమిటి కనిపెట్టి?" అనే సమస్య యిప్పటికీ నాలో అలాగే నిల్చి వుంది. తలుచుకొన్నప్పుడల్లా "అదిగో! అక్కడనే వుంది అమ్మ" అనేలో వోఁవుగట్టి నమ్మకం నా హృదయ కవాటాన్ని తట్టుతూ వుంటుంది. కాని భౌతికదృశ్యం ప్రత్యక్షపఱచుకుంటే కనవచ్చేది—ఓ తెల్లని దుప్పటి రేకు. నిలువునా నేలమీద పండబెట్టి మా అమ్మమీద నాటిరాత్రి కప్పినట్టు ఓ తెల్లని దుప్పటి రేకు.

అప్పటినుంచీ నాలో మాతృదేవతను గురించిన విచింతనం రేకెత్తినప్పుడల్లా ఆ తెల్లని దుప్పటిగూడు, రాజహంస రెక్కల్లా విప్పారి కనిపిస్తూ నా మనస్సునకు నైజ నైర్మల్యాన్ని ఎప్పటి కప్పటి కొడగూరుస్తూ వుంటుంది. అదే నా మాతృ చిహ్నము!

.... .... .... .... ....

## కడాపటి ఎందుకొమ్మ

తనువూ తరువూ ఒకలాగే ఎదిగేని అనుకొనేలా కొన్నాళ్ల కోమలంగానే అగపించేవాడు ఆ చెట్టుక్రింద ఆతగాడు. ఆతగాడి